క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



గంగమ్మ జాతరకు సంప్రదాయబద్ధంగా వెళ్తున్న భక్తులు

ఉదయగిరి: పట్టణంలో యాదవ సామాజిక వర్గీయులు ఆదివారం గంగమ్మ జాతరను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పొంగలి, సామగ్రిని ప్రత్యేక తట్టలో అలంకరించుకుని డప్పు వాయిద్యాలు, బాణసంచా సందడితో యాదవపాళెం నుంచి ఊరేగింపుగా ఆనకట్ట వరకు చేరుకుని గంగమ్మకు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలు, సిరి సంపదలు, సుఖసంతోషాలతో విరాజిల్లుతూ ఉండాలని కోరుకున్నారు.

వైభవంగా నరసాలమ్మ పొంగళ్లు



తలపై పొంగళ్లు పెట్టుకుని నరసాలమ్మకు పూజలు చేసేందుకు వెళ్తున్న మహిళలు

సంగం: మండలంలోని చెన్నవరప్పాడులో కొలువైన నరసాలమ్మ అమ్మవారి పొంగళ్లు గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మహిళలు, గ్రామ పెద్దలు, ప్రజలు తప్పెట్లతో పొంగళ్లతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారిని పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగళ్లు పెట్టారు.

చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి



ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: మానవులను, దేవతలను తీవ్ర హింసలకు గురి చేస్తున్న రాక్షసులను 9 రోజుల పాటు భీకర యుద్ధం చేసి సంహరించి మహిళా శక్తి ?త్కి ప్రతిరూపంగా నిలిచిన చెడుపై మంచి సాధించిన దుర్గాదేవి విజయాన్నే విజయ దశమిగా జరుపుకోవడం ఆనవాయితీ అని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. విజయదశమి పండగను ప్రజలు ఆనందంగా జరుపుకొని సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల పాటు అమ్మ వారి దీక్షలు చేపట్టిన మహిళలు భక్తి శ్రద్ధలతో ఆలయాల్లో పూజలు నిర్వహించి విజయ దశమిని ఆనందంగా జరుపుకోవాలన్నారు.

నీళ్ల ట్యాంకు శిథిలం



ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో తాగునీటి సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో పరిసరాల్లో నివాసం ఉండే వారు కొంత కాలంగా భయం భయంగా బతుకుతున్నారు. మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ ట్యాంకు కాంక్రీటు దిమ్మెలు సైతం ఇనుప చువ్వలు బయట పడి సిమెంట్ పెచ్చులూడి పడుతున్నాయి. బోరు పాయింట్ నుంచి ట్యాంకు పైభాగానికి చేరిన నీరు లీకేజీల వల్ల కిందకు కారిపోతున్నాయి. ప్రాణసంకటంగా మారిన ఈ ట్యాంకును తక్షణమే తొలగించి ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ పథకం ద్వారా కొత్త ట్యాంకు నిర్మించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నేత కొప్పోలు యల్లారెడ్డి, తదితరులు కోరుతున్నారు.

ప్రతి ఇంటా జగనన్న సంక్షేమం

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి



లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: నాలుగున్నరేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రతి కుటుంబంలోనూ కనిపిస్తున్నాయని, రాబోయే రోజుల్లో జగన్ ప్రభుత్వాన్ని కొనసాగిస్తేనే ప్రజల భవితవ్యం ఆశాజనకంగా ఉంటుందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామస్వామిపల్లిలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత స్థానిక సర్పంచ్ సంపతి రమణమ్మ, ఆత్మకూరు సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శాలువా, పూల మాలలు, బాణసంచా మోతలు, డప్పు వాయిద్యాలతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం గడప గడపకు తిరిగి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా నాలుగేళ్లలో రూ.3 లక్షల కోట్లు నిధులు నేరుగా ప్రజలకు అందజేశామన్నారు. ఏ కారణం చేతనైనా అర్హులై ఉండి పథకాలు అందని వారికి వలంటీర్ల ద్వారా మరోసారి సర్వే చేయించి ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూర్చామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల అందరికీ ఆరోగ్య భద్రత కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్ని సీట్లలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోవాలి

నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే ధ్యేయంతో నవంబరు 2న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలోని 2 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వివిధ కంపెనీలు ఆసక్తి కనపరుస్తున్నాయని తెలిపారు. యువతీ, యువకులు తమ అర్హతల ప్రామాణికంగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఈడీ విచారణకు సహకరిస్తాం

గత 50 ఏళ్లుగా నిర్వహించబడుతున్న కేఎంసీ సంస్థ ఎలాంటి ఆరోపణలు లేకుండా అగ్రశ్రేణిలో కొనసాగుతుందన్నారు. కేరళలో మరో నిర్మాణ సంస్థతో కలిసి గతంలో చేసిన రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి ఇటీవల ఈడీ అధికారులు విచారణ చేస్తున్నారన్నారు. ప్రతి సంస్థలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించి విచారణ సంస్థల అధికారులు అవసరమైనప్పుడు రికార్డులు పరిశీలించుకుని విచారించడమనేది సాధారణ విషయమన్నారు. తమ సంస్థ తరఫున అధికారులకు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇందూరు వెంకట రమణారెడ్డి, గడ్డం శ్రీనివాసులు రెడ్డి, ముక్కమళ్ల భాస్కర్ రెడ్డి, కొప్పోలు యల్లారెడ్డి, తహసీల్దారు జగదీష్‌బాబు, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న మండల కన్వీనరు ఓబుల్‌రెడ్డి

ఉదయగిరి: రాష్ట్ర సమూలాభివృద్ధి సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని షాదీమంజిల్‌లో ఆదివారం 'ఎందుకు ఆంధ్రాకు జగన్ కావాలి' అనే కార్యక్రమంలో భాగంగా మండల నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు గానుగపెంట ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు భేషుగ్గా అమలు జరుగుతున్నాయన్నారు. ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లో లబ్ధి చేకూరుతోందన్నారు. జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకం ద్వారా 83 శాతం కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరిందన్నారు. ప్రభుత్వం చేసిన ఈ మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నవంబరు 1 నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు వివరించి మళ్లీ సీఎంగా జగన్‌ను చేసుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించాలన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి పథంలో పయనించేందుకు మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌నే గెలిపించుకుందామన్నారు. ఆయనతో పాటు పలువురు వక్తలు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు దస్తగిరి అహ్మద్, మట్ల లక్ష్మయ్య, తిరుపతిరెడ్డి, సుభాని, కల్లూరి కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, తదితరులున్నారు.

నేడు బంట్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లి సచివాలయం పరిధిలో సోమవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని మేకపాటి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏపై హర్షం

కావలి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దసరా కానుకగా డీఏ పెంచడంపై వైఎస్సార్ టీచర్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మునీర్ జాన్, జిల్లా అధ్యక్షుడు కేవీ నారాయణరాజు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు 3.64 శాతం డీఏ మంజూరు చేయాలని సీఎం ఆదేశాలు ఇవ్వడంపై ప్రభుత్వ ఉద్యోగుల్లో హర్షతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతి అని, ఇతర సమస్యలను పరిష్కరిస్తుందని మునీర్ జాన్, కేవీ నారాయణరాజు తెలిపారు.

టీజీపీ డిప్యూటీ కలెక్టర్ సువర్ణమ్మ బదిలీ

ఆత్మకూరు: ఆత్మకూరులోని తెలుగుగంగ ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ జి.సువర్ణమ్మ వెలుగొండ స్పెషల్ కలెక్టర్ పీఏగా బదిలీ అయ్యారు. మూడేళ్లకుపైగా ఆత్మకూరు తెలుగు గంగ ప్రాజెక్ట్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను బదిలీ చేస్తూ ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆమె స్థానంలో రాపూరు టీజీపీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం రాజారమేష్ ప్రేమ్‌కుమార్‌ను బదిలీ చేశారు. మరో రెండు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

అంత్యక్రియలకు రూ.10 వేల ఆర్థిక సాయం

• సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నూతన సేవకు శ్రీకారం



మాట్లాడుతున్న కంచి పరమేశ్వర రెడ్డి, తదితరులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు, సహాయకులకు సిబ్బందికి నిత్యాన్నదానం చేస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి మరో నూతన సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ట్రస్ట్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఏడు నెలలుగా పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కలెక్టర్ అనుమతితో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారంతో నిత్యాన్నదానం చేసేందుకు అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగిస్తామన్నారు. తన తదనంతరం సైతం అన్నదాన కార్యక్రమం కొనసాగేలా ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో సొంత ఊరికి మరేదైనా సేవ చేయాలనే తలంపుతో మున్సిపల్ పరిధిలోని 23 వార్డుల్లో పేదలెవరైనా మృతి చెందితే అంత్యక్రియల కోసం ఆ కుటుంబీకులకు అప్పటికప్పుడే రూ.10 వేల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించారు. విజయదశమి నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఈ రెండు రోజుల్లో అలాంటి ఘటనలు జరిగి ఉంటే వారికి విజయదశమి రోజు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు. పేదలకు తన వంతు సాయంగా సేవ చేసేందుకు ఎప్పుడు ముందుంటానని పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు విశ్రాంత హెచ్ఎం కేవీ శేషారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, యానాదిరెడ్డి, కె చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం



పిరమిడ్ మాస్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

చేజర్ల: ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పామూరుకు చెందిన పిరమిడ్ మాస్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పులనీళ్లపల్లి వెంకయ్యస్వామి మందిరంలో జరిగిన ధ్యాన తరగతుల్లో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రోజూ ధ్యానం చేయడం అలవర్చుకోవాలన్నారు. ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. ధ్యానం సర్వ రోగ నివారిణి అని, మనం చేసే ప్రతి పనిలో మంచి ఫలితాలుంటాయన్నారు. పిరమిడ్ మాస్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆత్మకూరు పిరమిడ్ మాస్టర్ మూరంరెడ్డి వెంటేశ్వరరెడ్డి అన్నారు.

ఘనంగా అష్ఫాకుల్లా 123వ జయంతి



స్వాతంత్ర్య సమరయోధుడు ఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆవాజ్ సంఘ నేతలు

ఆత్మకూరు: స్వాతంత్ర్యం కోసం చిన్న వయసులోనే ఉరి కంబం ఎక్కి ప్రాణాలు అర్పించిన అష్ఫాకుల్లా ఖాన్ 123వ జయంతిని ఆవాజ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని సుల్తాన్ షహీద్ దర్గా సమీపంలోని ఆటోనగర్‌లో తొలుత అష్ఫాఖుల్లా చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన జమిందారీ కుటుంబంలో జన్మించినా చిన్న వయసు నుంచే దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటంలో పాల్గొన్నారని, చివరికి స్వాతంత్ర్యం కోసం ఉరికంబం ఎక్కి ప్రాణాలు అర్పించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పి.ఎస్దానీ, సయ్యద్ జమీర్, పలువురు ఆటో నగర్ కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా అష్ఫాకుల్లా ఖాన్ జయంతి



అష్ఫాకుల్లా ఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

మర్రిపాడు: దేశ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయస్సులోనే ప్రాణాలు త్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు అష్ఫాకుల్లా ఖాన్ జయంతిని ఆదివారం మండలంలోని ఆవాజ్ కమిటీ నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మర్రిపాడు ఆవాజ్ కమిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్‌బాషా, ఉపాధ్యక్షులు సయ్యద్ రహమతుల్లా, సీనియర్ నాయకులు పఠాన్ రసూల్ అహ్మద్, నాగూర్ బాషా, కాలేషా, మహ్మద్ రఫీ, మౌలాలి, నజీర్, జిలాని, మహబూబ్ దాదా, సీపీఎం సీనియర్ నాయకులు సూర్యనారాయణ తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా బొగ్గేరు ఆక్రమణలు



ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరు-నాగులపాడు రహదారి పక్కన లోలెవల్ వంతెన సమీపంలో కొందరు కబ్జాదారులు బొగ్గేరు ఆక్రమణలకు పాల్పడుతున్నారు. మహిమలూరు రైతులకు చెందిన 500 ఎకరాలకుపైగా మాగాణి భూములకు వెళ్లేందుకు అనాదిగా ఒక మట్టి రోడ్డును వినియోగిస్తున్నారు. ఈ రోడ్డును సైతం వదలకుండా బొగ్గేరులో కలిపి మట్టి తోలి చదును చేసుకుంటున్నారు. ఈ విషయమై గ్రామస్తులు సమాచారం ఇవ్వడంతో స్థానిక వీఆర్ఏ నరసింహారావు స్థలానికి చేరుకుని బొగ్గేరు ఆక్రమణ పనులను అడ్డుకున్నారు. దీంతో ఆక్రమణదారులు వీఆర్ఏతో వాగ్వివాదానికి దిగారు. రెవెన్యూ అధికారులు స్పందించి బొగ్గేరు ఆక్రమణలు తొలగించడంతో పాటు రైతుల భూముల్లోకి రాకపోకలకు అనువుగా రోడ్డు నిర్మించాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గాష్టమి పూజలు

శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా పలు అమ్మవారి ఆలయాల్లో ఆదివారం దుర్గాష్టమిని పురస్కరించుకుని దుర్గాదేవికి మహిళలు పూజలు నిర్వహించారు. ఆత్మకూరులోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరాలయంలో దుర్గా అలంకారం చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్ర పారాయణలు నిర్వహించారు. జ్వాలాముఖి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్



ఆత్మకూరు: కన్యకాపరమేశ్వరి మూలవిరాట్టుకు వెన్నతో అలంకరణ



ఆత్మకూరు: జ్వాలాముఖి ఆలయంలో అలంకరణ



ఆత్మకూరు: దుర్గాదేవిగా కన్యకాపరమేశ్వరి



మర్రిపాడు: దుర్గాదేవిగా ఇంద్రాక్షి అమ్మవారు



సోమశిల: దుర్గమ్మగా తూమాలమ్మ



సంగం: దుర్గాదేవి అలంకారంలో కామాక్షితాయి



చేజర్ల: బోడిపాడులో ధనలక్ష్మిగా మహాలక్ష్మి అమ్మవారు



ఉదయగిరి: దుర్గాదేవి అలంకరణలో పార్వతీదేవి



బాలాజీనగర్‌లో మహిషాసురమర్దినిగా దుర్గాదేవి



వరకుంటపాడు: మహాగౌరీదేవిగా మనసాదేవి